క్లుప్తంగా

ప్రమాదకరంగా బావి



మాగనూర్: మండలంలోని కోల్పూర్ పంచాయతీ పరిధిలో పురతన బావి ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు, ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా గ్రామసమీపంలో ఉండటంతో పాటు గ్రామ ప్రధాన రహదారి చెరువు కట్ట పక్కన ఉండటంతో వాహనాలు అదుపు తప్పి అందులో పడి ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. గతంలో పల్లె ప్రగతిలో భాగంగా ప్రమాదకర బావిలు మూసి వేయాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ఇప్పటి వరకు బావిని మాత్రం పూడ్చకపోవడంపై అధికారులు తీరుపై గ్రామస్తులు, వాహనాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



మాగనూర్: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సీసీ రోడ్డు వేయడంతో అది కాస్తా ప్రమాదకరంగా మారింది. మండలంలోని కొల్పూర్‌లో మూడుమాల్‌కు వెళ్లేదారిలో సీసీ రోడ్డు వేశారు. అయితే సీసీతో పాటు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా కేవలం సీసీ రోడ్డు మాత్రమే వేయడంతో వర్షాలు కారణంగా వరద నీటికి మట్టి మొత్తం కొట్టుకుపోవడంతో ప్రస్తుతం సీసీ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రమాదకరంగా మారిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చోరవ చూపి డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

డ్రెయినేజీలు నిర్మించండి



మాగనూర్: మండలంలోని వడ్వాట్‌లో ప్రధాన రహదారుల వెంట డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి రైతువేదిక వరకు సీసీ రోడ్డు పక్కన డ్రెయినేజీ లేకపోవడంతో మురుగుతో దుర్వాసనతో పాటు పందుల వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. మురుగు వలన అనేక రోగాలు వస్తున్నాయని అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కనుమరుగైన చేతిపంపులు



మరికల్: ఒక్కప్పుడు పల్లెలకు తాగునీరు అందించిన చేతి పంపులు నేడు కనుమరుగు అవుతున్నాయి. వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటిపోవడంతో గంటల తరబడి చేతి పంపులను కొట్టిన బిందెడు నీళ్లు రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో రాను, రాను చేతిపంపులు కనుమరు అవుతూ వచ్చాయి. గతంలో ఒక్కో గ్రామంలో పది నుంచి 50 లోపు చేతి పంపులు ఉండేవి. ప్రస్తుతం ఏ గ్రామం వెళ్లి చూసిన ఒక చేతి పంపు మాత్రం కన్పించడం లేదు. ఏదో ఓ గ్రామంలో కన్పిస్తే మహాగొప్ప అనుకోవాలి. విద్యుత్ మోటార్ల సాయంతో పబ్లిక్ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయడంతో చేతి పంపుల వాడకం తక్కువైంది.

హైమాస్ట్.. హైవేస్ట్



అమరచింత: మండలంలోని కిష్టంపల్లి ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగకపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదు. ఇందిరమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని నెలలుగా ఒరిగిపోతూ కిందపడుతున్న వాటిని తొలగించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద చౌరస్తాలో నిత్యం రాత్రి వేళలో వెలుతురు ఉండాలని ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను పునరుద్ధరించాలని జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

సర్పంచ్ లేక అభివృద్ధికి ఆటంకం

- 2020లో తంగిడి సర్పంచ్ మృతి
- ఉప సర్పంచ్‌కు బాధ్యతలు అప్పగించిన అధికారులు



తంగిడి పంచాయతీ కార్యాలయం

కృష్ణా: మండలంలో తంగిడి గ్రామానికి సర్పంచ్ లేకపోవడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామ సర్పంచ్ గుండురావ్ కులకర్ణి 2020 ఆగస్టు 19న గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో ఉప సర్పంచ్ మహిబుబ్‌పాషకు సర్పంచ్ బాధ్యతలు, ఉప సర్పంచ్ బాధ్యతలను వార్డు మెంబర్ చెన్నప్పకు అప్పగించారు. ఈ తాత్కాలిక సర్పంచ్‌తో గ్రామంలో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుటకు అవకాశం ఉంది. కాని ఏదైన అభివృద్ధి కావాలంటే పూర్తిస్థాయిలో సర్పంచ్ ఉంటే ఉన్నతాధికారులతో కాని, ఉన్నత స్థాయిలో ప్రజా ప్రతినిధులతో చర్చించి పనులు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రజా ప్రతినిధి మృతి చెందితే 6 నెలల్లోనే ఉప ఎన్నికలు నిర్వహించాలి. గతంలో ఓ వార్డు మెంబర్ మృతి చెందితే ఆరు నెలల్లోనే ఉప ఎన్నికలు జరిగేవి. ఇప్పుడు ఏకంగా మూడేళ్లు దాటిపోయిన ఇప్పటి వరకు ఉప ఎన్నిక కాకపోవడం విచారకరం. ఇంకో సంవత్సరం గడిస్తే ఇక ఎన్నికలే వచ్చే అవకాశం ఉంది. గ్రామంలో మొత్తం 1,800 జనాభాతో 1,169 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో మొత్తం 10 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ గ్రామ ప్రజాప్రతినిధులు తమ తమ పనులు చేసుకుంటే తప్ప వారి జీవనం కొనసాగడం లేదు. పైగా ఈ అదనపు బాధ్యతలు అప్పగించడంతో కొంత ఇబ్బందికరంగా వారు భావిస్తున్నారు.

సంతకాలకే ఇన్‌చార్జ్



సంక్షేమ పథకాల అమలుకు, ఇతర విషయాలకు సంతకాలకు మాత్రమే ఇన్‌చార్జ్ సర్పంచ్ ఉపయోగపడుతున్నాడు. ఉన్నతాధికారులతో గ్రామానికి అవసరమయ్యే మౌలికల వనరులను సమకూర్చుకోవడానికి ఉపయోగపడడం లేదు. గ్రామ సమీపంలో కృష్ణా, భీమ నదుల సంఘమ క్షేత్రం ఉంది. ఇక్కడకు ప్రతి రోజు భక్తులు వస్తుంటారు. వారికి అవసరమయ్యే సౌకర్యాలను ప్రభుత్వం నుంచి సమకూర్చుటకు ఉన్నతాధికారులతో చర్చించి అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇక్కడ తాత్కాలిక సర్పంచ్ ఉండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– శివప్పగౌడ, తంగిడి గ్రామం

పట్టించుకోవడం లేదు



గ్రామానికి ఇన్‌చార్జ్ సర్పంచ్ ఉండడంతో ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. పైగా గ్రామానికి ఏ సంక్షేమ పథకాలు వస్తున్నాయే తెలియదు. గ్రామంలో వీధిలైట్లు, డ్రెయినేజీల శుభ్రత, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై తమ తాత్కాలిక సర్పంచ్ అధికారులను అడిగినా వారు పట్టించుకోవడం లేదు. ఉప ఎన్నికలు నిర్వహించి న్యాయం చేయాలి.

– చిగిరే సాయిబన్న, తంగిడి

ఉప ఎన్నిక నిర్వహించాలి..



ఉప ఎన్నికలు జరిగితే నాకు ఈ అదనపు బాధ్యతల నుంచి భారం తగ్గుతుంది. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో మాకు ప్రతి నిత్యం పనులు ఉంటాయి. ఈ సర్పంచ్ బాధ్యతల వల్ల నా పనులు కుంటుపడుతున్నాయి. ఎంత త్వరగా ఉప ఎన్నికలు జరిగితే అంతా మాకు బావుంటుంది. ఉన్నతాధికారులు కూడా కొంత మా గ్రామంపై నిర్లక్ష్యం చేస్తున్నారు.

– మహిబుబ్‌పాష, ఇన్‌చార్జ్ సర్పంచ్, తంగిడి

నత్తనడకన వైకుంఠధామాలు

- బిల్లులు అందక నిలిచిన నిర్మాణ పనులు



అమరచింతలో నిలిచిన వైకుంఠధామ నిర్మాణ

అమరచింత: కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో అధునాతనమైన పద్ధతిలో నూతన వైకుంఠధామాలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో వైకుంఠధామం నిర్మాణం కోసం రూ.కోటి విడుదల చేసింది. వీటి కోసం టెండర్ ప్రక్రియ చేపట్టి పనులను అప్పగించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించినా.. సరైన సమయానికి బిల్లులు అందకపోవడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో నిర్మాణ పనులు 65 నుంచి 70 శాతం వరకు పూర్తవగా మిగిలిన పనులు అటకెక్కాయి. జిల్లాలో కొత్తగా ఏర్పాటు జరిగిన అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, పెబ్బేర్ మున్సిపాలిటీల్లో వైకుంఠధామ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ బడ్జెట్ ద్వారా నిధులు సమకూర్చుతుండటంతో పనులను చేపడుతున్న కాంట్రాక్టర్లకు సకాలంలో డబ్బులు అందకపోవడమే ఇందుకు ప్రధాన కారణం అని పలువురు వెల్లడించారు. పెద్ద పట్టణాల్లో స్థల ప్రభావం ఉండటంతో భవిష్యత్తులో మృతదేహాల ఖననం కోసం స్థలాలు ఉండవని భావించి నూతన టెక్నాలజీతో భావితతరాలకు ఉపయోగపడే విధంగా వైకుంఠధామాలను నిర్మించేందుకు సిద్ధమైన ప్రభుత్వం వీటి నిర్మాణాలకు త్వరితంగా డబ్బులను చెల్లించాలని కోరుతున్నారు.

సౌకర్యాలు ఇలా..

కొత్తగా నిర్మించే వైకుంఠధామాల్లో మృతదేహాల దహనం కోసం వచ్చిన వారికి సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికతో నిర్మణ పనులు చేస్తున్నారు. వీటిలో వెయిటింగ్ గదులు, సెక్యూరిటీ గది, ఆస్ రూం తో పాటు సీటింగ్ గ్యాలరీ ఏర్పాటు చేస్తారు. రెండు బర్నింగ్ ప్లాంట్లు, పూజా మండపం, టాయిలెట్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా ఆహ్లాదం కోసం వైకుంఠధామం మధ్యలో పార్కును ఏర్పాటు చేస్తారు. వీటి చుట్టు ప్రహరీ లేదా పెన్సింగ్‌ను కల్పించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రభుత్వం సంకల్పించింది.

ఉసిరిచెట్లకు పూజలు



మరికల్: మండల కేంద్రంలోని దత్తనగర్, గజ్జలమ్మగడ్డ, అశోక్‌నగర్ కాలనీ వాసులు శుక్రవారం ఘనంగా కార్తీకమాసం పూజలు నిర్వహించారు. మహిళలు ఉసిరిచెట్లకు ప్రత్యేక పూజలు చేయగా గ్రామస్తులకు తీర్థప్రసాదలను, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వనభోజనలు చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ధన్వాడ: ఓఎంఐఎఫ్, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, అనూరాధ, కతలప్ప, తుల్జారామ్, హజమ్మ, సుకన్య, నర్మద, జ్యోతి, అంజమ్మ పాల్గొన్నారు.

సాంకేతిక విద్య.. అంతా మిథ్య



నర్వలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో కుంటుపడ్డ కంప్యూటర్ బోధన
- నిర్వహణ లేక మూలనపడ్డ కంప్యూటర్లు



నర్వ కేజీబీవీలో కంప్యూటర్ విద్యను అందిస్తున్న శిక్షకులు(ఫైల్)

నర్వ: విద్యార్థులకు నేడు సాంకేతిక విద్య ఎంతో అవసరం. ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య నేర్పించకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లి శిక్షణ తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు కంప్యూటర్ విద్యకు దూరమైపోతున్నారు. ఒక వైపు ప్రభుత్వం పాఠశాలల్లో డిజిటల్ బోధనతో కొత్త హంగులు సమకూరుస్తుంది. అయినప్పటికీ కంప్యూటర్ విద్య మాత్రం అటకెక్కింది. రూ.లక్షలు విలువ చేసే కంప్యూటర్లు ఉన్నా బోధకులు లేక అవి మూలకుచేరాయి. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది.

గతంలో ప్రారంభం ఇలా..

2008 నవంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు రెండు విడతలుగా కంప్యూటర్లను అందజేసింది. ఒక్కో పాఠశాలకు 11 చొప్పున కంప్యూటర్లు, పలు పాఠశాలల్లో జనరేటర్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రింటర్లను సైతం అందించారు. వీటి నిర్వహణ బాధ్యతను ఓ ఏజెన్సీకి ఐదేళ్ల వరకు అప్పగించింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఈ కంప్యూటర్ విద్యా బోధనను ప్రారంభించింది. ఇందుకు ప్రైవేటు సంస్థలకు ఐదేళ్ల వరకు బోధనను నిర్వహించేందుకు అప్పగించింది. సదరు సంస్థ వారు ప్రత్యేక విద్యాబోధకులను ఇద్దరేసి చొప్పున, వీరిని పర్యవేక్షించేందుకు సూపర్‌వైజర్‌లను నియమించింది. బోధకులకు నెలకు రూ.2,476 వేతనం చెల్లించేవారు. అప్పట్లో వేతనాలు సక్రమంగా అందజేయకపోవడంతో పలువురు మధ్యలోనే మానేయడంతో పలు పాఠశాలల్లో కొంతకాలం ఒక్కరితోనే కంప్యూటర్ బోధన కొనసాగింది. మూడేళ్ల పాటు పాఠశాలల్లో సాంకేతిక విద్య విధుల్లో చేరలేదు. దీంతో సెప్టెంబర్ 2013లో ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ బోధన పూర్తిగా నిలిచింది. ఏజెన్సీ నిర్వహణ ఒప్పందాన్ని తిరిగి పునరుద్ధరించకపోవడంతో అప్పటినుంచి విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వం విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యావలంటీర్లతో పాటు కంప్యూటర్ విద్యా బోధకులను నియమించి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విస్తరించాలని లేదంటే రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన కంప్యూటర్‌లు పాత సామాన్లు వారికి అమ్మే పరిస్థితి దాపురిస్తుందని పలువురు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



మన ఊరు మన బడి కార్యక్రమంలో నిరుపయోగంగా మారిన కంప్యూటర్ బోధన అంశం ప్రస్తావనకు వచ్చింది. పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లను మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకవెళ్లాం. మన ఊరు మనబడి కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాలలకు ట్యాబ్‌లు, హైస్కూల్‌లకు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కోసం నివేదికలు పంపించాం.

– విద్యసాగర్, ఏఎంఓ, నారాయణపేట

రైతులకు అందని టార్పాలిన్లు



మాద్వార్‌లో యూరియా సంచులతో కప్పి ఉంచిన ధాన్యం

మక్తల్: రైతులు పండించిన ధాన్యం వర్షానికి తడవకుండా ఉండేందుకు ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే టార్పాలిన్లు పథకం మూడేళ్లుగా నిలిచిపోయింది. గతేడాది వర్షాకాలంలో కురిసిన వర్షాలకు చాలా మంది రైతుల ధాన్యం తడిసి పోవడంతో తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని రైతులు లక్ష ఎకరాలకు పైగా పంటలు పండించేందుకు భూమిని సాగు చేశారు. వరి, పత్తి, కంది వివిధ పంటలను సాగు చేశారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. సాయంత్రం వేళల్లో ధాన్యం తడిసి ముద్దవుతుంది. యాసంగిలో వరి సాగు అధికంగా ఉండటంతో రహదారులపై కల్లాలు ఏర్పాటు చేసుకున్నారు. ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. యంత్రీకరణ పథకంలో ప్రభుత్వం 50శాతం రాయితీపై రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేసేది. ప్రస్తుత పరిస్థితిల్లో రైతులు ప్రైవేట్‌గా అధిక ధరలకు కొనుగోలు చేసుకోనే పరిస్థితి నెలకొంది.

ఇలా ఉంటే.. వెళ్లేది ఎలా?



రాయికోడ్-కల్వాల్ రహదారిలో అండర్‌బ్రిడ్జిలో నిలిచిన నీరు

నర్వ: మండలంలోని రాయికోడ్ కల్వాల్ బీటీ రహదారిలో ఉన్న అండర్ బ్రిడ్జి వంతెన వద్ద నీరు ఎప్పటికి నిలిచి రాకపోకల పూర్తిగా బంద్ అయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్నేళ్ల క్రితం భూత్పూర్ కెనాల్ కింద వైపు రాకపోకల కోసం నిర్మించిన అండర్ బ్రిడ్జి నిర్మాణం సరైన ప్లాన్ ప్రకారం నిర్మించకపోవడంతో ఎల్లప్పుడు అధిక స్థాయిలో నీళ్లు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలిచిన నీళ్లు వెళ్ళేందుకు మార్గం లేకపోవడంతో ఆ నీటిలో చిన్న, పెద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ నీటిని మళ్లించేందుకు మార్గం చేస్తే తప్ప ప్రయాణించడం కష్టంగా మారింది. ప్రస్తుతం దాని పక్కన మట్టి రహదారిలో ప్రయణిస్తున్నప్పటికి వర్షకాలం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన అండర్ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. అధికారులు చొరవ తీసుకుని ప్రయాణ ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

రెవెన్యూ గ్రామంగా మారేదెన్నడో?




అప్పంపల్లి గ్రామం

మరికల్: మండలంలోని అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా మారడం లేదు. ఇంకేనాళ్లు నిరీక్షణ చేయాలని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ దాదాపు 3వేలకు పైగా జనాభా ఉన్నారు. కాని అప్పంపల్లి శివారు మాత్రం కిష్టాపూర్, మాధ్వార్, మరికల్, మందిపల్లి సరిహద్దులో ఉండటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూములకు సంబందించిన వివరాలు, బ్యాంకు రుణాల విషయంలో ఆయా గ్రామాల అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన తర్వాత రెవెన్యూ గ్రామాల ప్రస్తావన తెర మీదకు తీసుకురాకపోవడంతో మాలాంటి గ్రామాలకు తీరని అన్యాయం జరుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. వచ్చే ప్రభుత్వమైనా అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా మార్చాలని కోరుతున్నారు.

నేడు ఆరాధనోత్సవాలు



సద్గురు అవదూత నర్సింహస్వామి మూలవిరాట్...



సద్గురు అవదూత నర్సింహస్వామి ఆలయం

నారాయణపేట రూరల్: పట్టణంలోని సద్గురు అవదూత నర్సింహస్వామి ఆరాధనోత్సవాలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. స్వామి సంజీవని జీవసమాధి సందర్భంగా 132న జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం కాకడహారతి, స్వామివారి మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, పాదుకపూజ, అఖండ దీప ప్రజ్వలన, అలంకరణ చేపడుతారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి మహిళలచే కార్తీక దీపారాదన కార్యక్రమం నిర్వహించనున్నారు. స్వామి భక్తులు, శిష్యబృందం పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మట్టి రోడ్డుపై నడిచే బాధ తీరింది

సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ

- గోపన్‌పేటలో రూ.1.27కోట్లు, కరివెనలో రూ.62 లక్షలు
- దంతనూరులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు పూర్తి



కర్వెన క్రాస్ నుంచి సీసీ రోడ్డు పూర్తి

మదనాపురం: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో ఫలితాలు ఇస్తున్నాయి. ఏళ్ల తరబడి అంతర్గత రోడ్ల నిర్మాణం జరగకపోవడంతో రాష్ట్ర ఏర్పాటు అనంతరం రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లోని అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేసింది. దీంతో గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ప్రధానంగా మదనాపురం మండలంలోని దంతనూరు క్రాస్ రోడ్డు నుంచి ఊరిలోకి రూ.20 లక్షలు, కర్వెన క్రాస్ రోడ్డు నుంచి ఊర్లోకి రూ.62 లక్షలు, గోపన్‌పేట క్రాస్ రోడ్ నుంచి ఊర్లోని ఆంజనేయస్వామి గుడి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలో రోడ్డు అధ్వానంగా ఉండేది. వర్షం వస్తే బురదలో నడుచుకుంటూ వెళ్లేవారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మట్టి రోడ్డుపై నడిచే బాధ తప్పిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిధుల వివరాలు

- ఎస్ఆర్‌జీఎస్ నిధులు రూ.69 లక్షలు, ఎస్‌డీఎఫ్ రూ.15 లక్షలు గ్రామ పంచాయతీ నిధులు రూ.28 లక్షలు, సీడీపీ నిధులు రూ.15 లక్షలు కేటాయించి గోపన్‌పేటకు రోడ్డు నిర్మాణం చేపట్టారు.
- ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ రూ.10 లక్షలు, సీడీపీ నిధులు రూ.20 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.12 లక్షలు ఖర్చు చేసి కరివెనకు సీసీ రోడ్డు వేశారు.
- ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15లక్షలు, సీడీపీ రూ.5 లక్షలు వినియోగించి దంతనూరుకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు.



దంతనూరు క్రాస్ రోడ్డు నుంచి సీసీ రోడ్డు పూర్తి

సంతోషంగా ఉంది

క్రాస్ రోడ్ నుంచి గ్రామంలోకి 1.5 కిలోమీటరు పొడవున రూ.62 లక్షలతో సీసీ రోడ్డు పూర్తి చేశాం. గతంలో మట్టి రోడ్డు గుండా నడిచేందుకు వర్షాకాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నా హయాంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేశాం.

– అనిత, సర్పంచ్, కరివెన

ఎమ్మెల్యే సహకారంతో..



క్రాస్ రోడ్ నుంచి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వరకు రూ.1.27 కోట్లు వెచ్చించి 2.16కిలో మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నా. దీనికి ఎమ్మెల్యే పూర్తి సహకారం అందించారు.

– అంజనేయులు యాదవ్, సర్పంచ్, గోపన్‌పేట

నడవాలంటే ఇబ్బందిగా ఉండేది



దంతనూరు క్రాస్ రోడ్ నుంచి ఊర్లోకి రావాలంటే మట్టి రోడ్డు గుండా నడవాలంటే ఇబ్బందిగా ఉండేది. వర్షాకాలంలో రోడ్లపూ ఏర్పడిన గుంతల్లో నీరు ఆగి బురద మయంగా మారేవి. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ఉండే. రూ.20 లక్షలతో అర కిలోమీటరు పొడువున సీసీ రోడ్డు వేశాం.

– శ్రావణి, సర్పంచ్, దంతనూరు